# స్వర్ణాంధ్రమా, సంక్షోభాంధ్రమా

## రాష్ట్రాన్ని విజన్ 2020 ఎటు తీసుకెళుతుంది?

ఇరవై సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌ను మలేసియా, ఇండోనేసియా, చైనాలకు దీటుగా స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని చంద్రబాబు ప్రభుత్వం 'విజన్ 2020' లో వాగ్దానం చేసింది. క్రీ.శ 2020 నాటికి ఆంధ్రప్రదేశ్ ఆర్థికరంగం 10 శాతం పెరుగుదల రేటును సాధిస్తుందని, తలసరి ఆదాయం తొమ్మిదిరెట్లు పెరుగుతుందని, దాంతో ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం పూర్తిగాపోయి అసమానతలు సంపూర్ణంగా మాసిపోతాయని విజన్ మన కళ్ళముందు ఒక సుందరస్వప్నాన్ని ఆవిష్కరించింది.

అయితే ఈ స్వప్నాన్ని నిజంచేయటానికి 'విజన్' ప్రతిపాదించిన విధానాలను వివరంగా చదివితే క్రీ.శ 2020 నాటికి ఆంధ్రప్రదేశ్ స్వరాంధ్రప్రదేశ్‌గా మారదనే అనుమానం బలంగా కలుగుతుంది. 'విజన్' సాధించదల్చిన రాష్ట్రాభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులే మూలం. ప్రైవేటు (విదేశీ) పెట్టుబడులను పెద్దఎత్తున ఆహ్వానించి తద్వారా 10 శాతం పెరుగుదల రేటును సాధించాలని 'విజన్' ఆలోచన. రాష్ట్ర ఉత్పత్తులను పెంచి వాటిని పెద్దఎత్తున ఎగుమతి చెయ్యటం కూడా 'విజన్' వ్యూహంలో భాగమే. దీనికవసరమయిన మౌలిక సదుపాయాలను కూడా ప్రైవేటు పెట్టుబడులతోనే సాధించాలని 'విజన్' యోచన. వీటి ద్వారా ఆటోమాటిక్‌గా ప్రజలందరి జీవన ప్రమాణాలు పెరుగుతాయని 'విజన్' ప్రతిపాదన.

'విజన్' కున్న అభివృద్ధి దృక్కోణానికీ, ఇప్పటివరకూ భారతదేశం అనుసరించిన అభివృద్ధి దృక్కోణానికీ గణనీయమైన తేడావుంది. ప్రభుత్వం అభివృద్ధి పథంలో క్రియాశీలక పాత్ర తీసుకోవాలనీ అభివృద్ధి ఫలాలు కొద్దిమంది చేతుల్లో మాత్రమే కేంద్రీకరింపబడకుండా చూడటానికి చర్యలు తీసుకోవాలనీ ఇదివరకటి దృక్కోణం వాదిస్తే 'విజన్' దీనికి పూర్తిగా వ్యతిరేకం. 70లలో, 80 లలో వచ్చిన వివిధరకాల ఉద్యమాలు అభివృద్ధి పథకాల్లో ప్రజలకు చోటు కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వాల మీద పెట్టాయి. అందువల్లే ఇంతకాలం అభివృద్ధి పథంలో చోటులేని ప్రజలకోసం కొన్ని రకాల సంక్షేమ పథకాలు వచ్చాయి. కానీ 'విజన్' లో ఈ పథకాలకు తిలోదకాలిచ్చే ప్రతిపాదనలు చాలా వున్నాయి.

ఈ రకమైన ప్రతిపాదనలతో, వ్యూహాలతో, లక్ష్యాలతో వచ్చిన 'విజన్ 2020' మనలో సహజంగానే చాలా ప్రశ్నలను లేవనెత్తుతుంది. విదేశీ పెట్టుబడులను కేంద్రంగా చేసుకున్న అభివృద్ధి పంథా ప్రజల్లోవున్న అసమానతనలను ఎంతవరకు తొలగించ గలుగుతుంది? ఈ

పెట్టుబడులు ఏరకమైన షరతులతో రాష్ట్రంలోకి అడుగుపెడుతున్నాయి? అసలు పెరుగుదల రేటును 10 శాతానికి పెంచటం సాధ్యమేనా? అవసరమేనా? ఇటువంటి అభివృద్ధి ఎవరికి ప్రయోజనకరం? దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు మరింత పడిపోవని గ్యారంటీ ఏమిటి? అసలు ఆయావర్గాల, కులాల ప్రజల అవసరాలకు, ఆశలకు ఈ అభివృద్ధిలో చోటుందా? లేనప్పుడు ఇప్పటికే ఉన్న అసమానతలెట్లా తొలగిపోతాయి? ఈ 'విజన్' చంద్రబాబు ఆలోచనా ఫలితమా లేక సరళీకృత యుగంలో మనమీద మోపబడుతున్న ఆర్థిక వ్యూహంలో భాగమా?

ఈ ప్రశ్నల్ని చర్చించటం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరం. ఎందుకంటే 'విజన్' లో ఉన్న ఆర్థిక విధానాలు చంద్రబాబు ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఓడిపోయినా కొనసాగుతాయి. ఈ చర్చలో పాల్గొనటానికి మానవహక్కుల వేదిక అందర్నీ ఆహ్వానిస్తున్నది.

20-5-1999

మానవ హక్కుల వేదిక
(Human Rights Forum)

స్థలం : ప్రెస్‌క్లబ్, బషీర్‌బాగ్
తేదీ : 24-5-99
సమయం : సాయంత్రం 6.00 గంటలకు

**అధ్యక్షత**

ఎ. సునీత, కన్వీనర్, మానవహక్కుల వేదిక

**వక్తలు**

ప్రొ.డి. నరసింహారెడ్డి, సెంట్రల్‌యూనివర్సిటీ
కె. బాలగోపాల్, మానవహక్కుల వేదిక
కోదండరామిరెడ్డి, మానవహక్కుల వేదిక
ప్రొ.కె.ఆర్. చౌదరి , ఎన్.జి. రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ

'ఏండమావి 2020' పుస్తకావిష్కరణ కూడా ఉంటుంది.